తెలంగాణ వైపు దేశం చూస్తోంది
అసెంబ్లీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



గోదావరిఖని, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కుల గణనపై నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ వైపు దేశం మొత్తం చూస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కుల గణన చేపట్టామని, ఇది చారిత్రాత్మక నిర్ణయమని, బీసీ, ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం వెనుకబడిన వారికి అన్నీ విధాలా అండదండలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టి జోడో యాత్రలో కులగణనపై నిర్ణయం తీసుకోవడం దేశానికే రోల్‌మోడల్‌గా మారిందన్నారు. కుల గణనపై అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయం అన్నీ వర్గాలకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన డీఎల్‌పీవో

మంథనిరూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను డీఎల్‌పీవో సతీష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించి సంబంధిత కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై ఆశలు

- పత్తిపాక రిజర్వాయర్‌కు నిధుల కేటాయింపు జరిగేనా!
- పోతారం ఎత్తిపోతల పథకం చేపట్టాలి
- స్థిరీకరణ కానున్న ఎస్సారెస్పీ 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు భూములు


ధర్మారం మండలం పత్తిపాకలో రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)
రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్ట నున్న బడ్జెట్‌పై జిల్లా రైతాంగం ఆశలు పెంచుకున్నది. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టి నియోజకవర్గంలో చివరి ఆయకట్టు భూములకు సాగు నీటిని అందిస్తామని, మంథని మండలంలో ప్రతిపాదిత పోతారం ఎత్తి పోతల పథకాన్ని చేపడతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి ప్రాథమి కంగా నీటి పారుదల శాఖాధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. నవంబర్ 24న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభు త్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, రామ గుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌లతో కలిసి ధర్మారం మండలం పత్తిపాకలో గల ప్రతిపాదిత రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించారు. 5 నుంచి 10 టీఎంసీల సామ ర్థ్యంతో నిర్మించాలని భావిస్తు న్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణానికి దాదాపు 1500 ఎకరాల భూములు ముంపునకు గురి కానున్నాయని అంచనా వేశారు. ఇందులో 400 ఎకరాలు అటవీ భూమి కాగా మిగతా భూమి రైతుల నుంచి సేకరించాల్సి ఉంటుందని, 2,400 కోట్ల రూపాయల వరకు వ్యయం కానున్నదని అంచనా వేశారు. ఈ రిజర్వా యర్‌ను నిర్మించి తీరతామని డిసెంబర్ 4న జిల్లాలో జరిగిన సీఎం యువ వికాసం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి

(మిగతా 8వ పేజీలో)

● పోతారం ఎత్తిపోతలతో 30 వేల ఎకరాలు..

మంథని నియోజకవర్గ పరిధిలోని మంథని, కమాన్ పూర్, రామగిరి, ముత్తారం మండలాల్లోని 22 వేల ఎక రాల ఎస్సారెస్పీ ఆయకట్టు భూముల స్థిరీకరణతో పాటు కొత్తగా 8 వేల ఎకరాల భూములకు సాగునీటిని అందించే విధంగా పోతారం ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లో కూడా చేర్చారు. సుందిళ్ల బ్యారేజీ నుంచి నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలోనే దీని నిర్మా ణానికి 400 కోట్ల రూపాయల వరకు వ్యయం అవు తుందని అంచనా వేసినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. గోదావరి అవతలి పక్కన చెన్నూరు ఎత్తిపోతల పథకాన్ని అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎన్నికల సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు సైతం పోతారం పథకాన్ని చేపడతామని హామీ ఇవ్వ డంతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుక వస్తున్నారు. ఆ మేరకు ఈ బడ్జెట్‌లో పోతారం ఎత్తిపోతల పథకాన్ని నిధులు కేటాయించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇండస్ట్రియల్ పార్క్‌పై నీలినీడలు
అధికారులను అడ్డుకున్న గ్రామస్థులు


వాహనాలకు అడ్డుగా ఉన్న గ్రామస్థులు

రామగిరి, మార్చి 18(మార్చి): మండలంలోని రత్నాపూర్ మేడిపల్లి శివారులో గల 203.31 గుంటల భూమిలో ఇండస్ట్రీల్ పార్కు ఏర్పాటుకు నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఫిబ్రవరిలో ప్రభుత్వం భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భూములు ఇవ్వమని స్థానికులు ఆందోళనలు చేపట్టారు. పంట భూములను కోల్పోతే తమకు గత్యంతరం లేదని, ఇండస్ట్రీల్ పార్కు ఏర్పాటుకు సుముఖంగా లేమంటూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మంగళవారం ఉమ్మడి జిల్లా ఇండస్ట్రీయల్ జోనల్ మేనేజర్ మహేశ్వర్, కొకాకోలా సంస్థ యాజమాన్యం, ఆర్డీవో సురేష్, తహసీల్దార్ సుమన్ స్థల పరిశీలనకు వెళ్లారు.

విషయం తెలుసుకున్న గ్రామస్థులు వాహనాల ఎదుట బైఠాయించారు. సుమారు రెండు గంటల పాటు అధికారులకు గ్రామస్థుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, మంథని సీఐ రాజులు గ్రామానికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికి అధికారులు వెళ్ళకుండ అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఊరట...
రెగ్యులరైజేషన్ చార్జీల చెల్లింపులకు వెసులుబాటు...

దరఖాస్తుదారులకు ఉపశమనం 8లో

ఏఐ ద్వారా విద్యార్థులకు బోధన సులభతరం


కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కోల్‌సిటీటౌన్, మార్చి 18 (ఆంధ్ర జ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ)ను వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన చేసే దిశగా చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం గాంధీపార్క్ మండల పరిషత్ ప్రాథమిక ఇంగ్లీష్ ఉర్దూ మీడియం స్కూల్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ఏఐ ద్వారా విద్యార్థులకు సులభరీతిలో బోధన ప్రారంభించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అభ్యాస సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ సహాయంతో బోధన పద్ధతులను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. జిల్లాలో 20 ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగా పైలట్ ప్రాజెక్టు కింద ఏఐ బోధన ప్రారం భిస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు తెలుగు, ఆంగ్లం రాయడం, చదవడం గణిత అంశాల్లో పట్టు సాధించేలా చూడడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రతీ పాఠశాలలో ఇంటర్నెట్ సదుపాయంతో కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డీ మాధవి, ఎంఈఓ పీఎం షేక్ ఉన్నారు.

ఖని ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్


ఆసుపత్రిలోని రిజిష్టర్‌ను పరిశీలన జరుపుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న 50పడకల క్రిటికల్ కేర్ భవనాన్ని, 5 అంతస్థుల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. పాత బిల్డింగ్‌లోని రెండో అంతస్థులో రెనోవేషన్ పనులను పరిశీలించారు. 15రోజుల్లో రెనోవేషన్ పనులను పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. రోగులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని, వైద్యులు సమయానికి విధులకు హాజరు కావాలని, రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు.

గోదావరిని ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం


పెద్దపల్లిలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాదయాత్ర

పెద్దపల్లిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరిని ఎండబెడుతోందని, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ తిరుగుబాటు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. పాదయాత్రలో రెండో రోజులో భాగంగా మంగళవారం పెద్దపల్లిలో కొనసాగింది. బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. చందర్ మాట్లాడుతూ సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఉత్తర తెలంగాణ సాగునీటి వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి రైతులను అరి గోస పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి గోసను ప్రజలకు వివరించేందుకు పాద యాత్ర చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎండిన గోదావరితో రైతన్నల కన్నీళ్లు, కష్టాలను చూసి చలించిన కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుతో కన్నీళ్లను తుడిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై అక్క సుతో కాళేశ్వరం కూలిందని గోదావరిని ఎండబెట్టిందని విమర్శించారు. రైతులు పంట పొలాలు ఎండుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు, ఎడారిగా మారిన విధానాన్ని ప్రజ లకు వివరించే విధంగా 180 కిలోమీటర్ల యాత్ర సాగుతుందన్నారు. గంట రాములు, రఘువీర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, తెలంగాణ ఉద్యమకారుడు బొడ్డు రవీందర్, రాజేష్, దాసరి ఉష, లైసెట్టి భిక్షపతి, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన పాదయాత్ర పెద్దకల్వల గ్రామానికి చేరుకోగా సీనియర్ బీఆర్ఎస్ నాయకులు సలేంద్ర కొమురయ్య వారికి స్వాగతం పలికారు. కోరుకంటి చందర్, తెలంగాణ ఉద్యమకారుడు బొడ్డు రవిందర్‌లను సన్మానించారు. నాయకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిండుకుండలా ఉన్న గోదావరిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెట్టిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. చందర్ పాదయాత్రకు బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. తెలంగాణ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి చందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ గొప్పత నాన్ని, గోదావరిని ఎండ బెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడానికి కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు వరకు పాదయాత్ర చేపట్టానన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతో కాళేశ్వరాన్ని వదిలేశారని గోదావరిని ఎండబెట్టారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 365 రోజులూ గోదావరి నిండు కుండలా ఉందని, పడవ పోటీలు నిర్వహించామన్నారు. గోదావరి ఎండ బెట్టడంతో పది రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని, సాగు నీటికి కటకట ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారన్నారు. మాజీ ఎంపీపీలు బాలాజీ రావు, పాల రామారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మ న్ బుర్ర శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సం దీప్‌రావు, సూర శ్యామ్, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, కూకట్ల గోపి, సాజిద్, గుర్రాల శ్రీను, పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

రాజీవ్ యువవికాస్ పథకంపై సంబరాలు


బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ మంగళవారం గోదావరిఖని చౌరస్తాలో నియోజకవర్గ అధ్యక్షుడు నాజీ ముద్దీన్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రామగుండం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్ హాజరై మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుద్యోగ యువత కోసం రాజీవ్ వికాస్ పథకం కింద ఉపాధి కల్పించడానికి ముఖ్యమంత్రి ప్రారంభించడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో 5లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో రూ.6వేల కోట్లతో స్వయం ఉపాధి పథకం కింద అర్హులైన నిరుద్యోగ యువతీయువకులను ఎంపిక చేస్తారని చెప్పారు. జూన్ 2న 5లక్షల మంది లబ్ధిదారులను ప్రకటిస్తారని, నియోజకవర్గానికి 4వేల నుంచి 5వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నట్టు, ఈ పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్, నాయకులు దీటి బాలరాజు, ముస్తాఫా, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, బొమ్మక రాజేష్, చుక్కల శ్రీనివాస్, దూళికట్ట సతీష్, గట్ల రమేష్, పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- పెద్దపల్లి జిల్లాలో వంద రోజుల ప్రణాళిక
- గ్రామ గ్రామాన సర్వే, వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- ఉచితంగా మందుల పంపిణీ
- జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో పెద్దపల్లి జిల్లా ఎంపిక
- గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంగా కార్యాచరణ

7

'ఉపాధిహామీ' లెక్క పక్కాగా..

- జన్‌మన్‌రేగా యాప్ రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- సమగ్ర సమాచారం నిక్షిప్తం
- యాప్ ద్వారా ఫిర్యాదుకు అవకాశం

పెద్దపల్లి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో కూలీల పనిదినాలు, డబ్బుల చెల్లింపులు, చేయాల్సిన పని దినాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం సమగ్ర సమాచారం కోసం ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఉపాధిహామీ పథకంలో ఉన్న కూలీల వివరాలను యాప్‌లో పొందుపర్చడం, యాప్ ద్వారా కూలీల డబ్బులు జమ తదితర విషయాలు తెలుసుకోవచ్చు. ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాల వివరాలు సరిగా అనుసంధానం కాకపోవడం, తప్పుగా నమోదు కావడంతో ఇబ్బంది పడుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం జన్‌మన్‌రేగా యాప్‌ను ఆవిష్కరించింది. పెద్దపల్లి మండ లంలో 14 వేల 561 జాబ్‌కార్డులు ఉండగా కూలీలు 31 వేల 242 మంది, 10,047 కూలీలు యాక్టివ్‌గా ఉన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు.



● తప్పిదాలు జరగకుండా ఉండేందుకు..

ఉపాధిహామీ పథకంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా పారదర్శకతకు పెద్దపీట వేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది. ఫోన్‌లో జన్‌మన్‌రేగా యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో ఉపాధి కూలీల హాజరు, నగదు జమ, విభాగం క్లిక్ చేస్తే సంబంధిత సమాచారం ఉంటుంది. రాష్ట్రం, జిల్లా జాబ్‌కార్డు, కుటుంబ గుర్తింపు సంఖ్య నమోదు చేస్తే వివరాలు కనిపిస్తాయి. కూలీ డబ్బులు జమ కాకపోతే కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. మరోవైపు పథకంలో చేపట్టే పనుల సమాచారం, స్థానిక అక్రమాలపై ఫిర్యాదులకు అవకాశం కల్పించారు. అంతే కాకుండా యాప్‌లో అన్ని భాషల్లో వివరాలు ఉంటాయి.

● యాప్‌పై అవగాహన తప్పనిసరి

జాతీయ ఉపాధిహామీ పథకంలో ఇప్పటివరకు చాలా మంది కూలీ డబ్బుల విషయంలో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవడంతో పాటు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌పై గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కూలీలు ఇబ్బందులు పడకుండా యాప్ ద్వారా తమ సందేహాలు ఉంటే వాటిని తెలుసుకునే విధంగా యాప్‌ను రూపొందించారు.

యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- కె.శ్రీనివాస్, ఎంపీడీవో, పెద్దపల్లి



జన్‌మన్‌రేగా యాప్ వినియోగించడం ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఉపాధి కూలీలు కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకుండా యాప్ ఎంతగానో దోహదపడుతుంది. గ్రామాల్లో జరిగే అక్రమాలపై కూడ యాప్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది.

చికిత్స పొందుతూ రిటైర్డు కార్మికుడి మృతి

పెద్దపల్లి రూరల్ , మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన జన్నపు రాజిరెడ్డి (72)ని కుటుంబ సభ్యులు రాఘవపూర్‌లోని రెడ్డి సంక్షేమ వృద్ధుల ఆశ్రమంలో పదినెలల క్రితం చేర్పించారు. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో సోమవారం ఆశ్రమంలో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వార్డెన్ గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ స్వామి తెలిపారు.

భర్త, అత్తమామలపై అదనపు కట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లోని చీకట్ల శ్రీకాంత్, అతడి తల్లిదండ్రులు ఎల్లవ్వ, రాజయ్యలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని అక్కపల్లి గ్రామానికి చెందిన రాధికకు మూడేళ్ల క్రితం హరిదాస్‌నగర్‌లోని శ్రీకాంత్‌తో వివాహమైంది. ఆ సమయంలో పుట్టింటి వారు రూ.11 లక్షల నగదు, తులం బంగారం ఇచ్చి పెళ్లి జరిపించారు. ఏడాది కాలంగా రాధికను భర్త, అత్తమామలు రూ.లక్ష అదనంగా కట్నం తీసుకు రావాలని వేధిస్తున్నారంటూ బాధితురాలు రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

ఇటలీలో రోడ్డు ప్రమాదం : ఒకరి మృతి

- 38 రోజుల అనంతరం ఇంటికి చేరిన మృతదేహం



రషీద్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వ్యక్తి రషీద్(42) ఇటలీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహం మంగళవారం సిద్ధిపేటకు చేరుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. రషీద్ మూడు నెలల కిందట ఇటలీకి వెళ్లి ట్రక్కు డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఫిబ్రవరి 12న లిథువేనియా నుంచి ఇటలీకి ట్రక్కుతో బయలుదేరాడు. వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి దాటుతున్న క్రమంలో మరో భారీ వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్ర గాయాలపాలైన రషీద్ మృతిచెందాడు. 38 రోజుల అనంతరం ఆయన మృతదేహం ఇంటికి చేరింది. ఎల్లారెడ్డిపేట నుంచి బంధువులు సిద్ధిపేటకు బయలుదేరి వెళ్లారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలు, సోదరులు, సోదరి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందికట్కూర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలుమాల శ్రీనివాస్, ఎలుక దీపికలకు గాయాలయ్యాయి. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్, దీపిక తదితరులు కందికట్కూర్ గ్రామంలో జరిగే వారసంతలో కూరగాయలు అమ్మడానికి మంగళవారం ఆటోలో బయలుదేరారు. ఎదురుగా కట్టెల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడగా, సిరిసిల్ల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నకిలీ ధ్రువపత్రాల కేసులో ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్య ధ్రువీకరణ పత్రాల కేసులో కత్తి దేవమ్మ, జేరిపోతుల సంజీవ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గాలిపెల్లి గ్రామంలోని పశువైద్యశాలలో ఓఎస్‌గా పనిచేస్తున్న దేవమ్మ కూతురుకు ఉద్యోగం ఇప్పించాలనే ఆలోచనతో మెడికల్ ఇన్‌వాలిడేషన్ సర్టిఫికెట్ కావాలని సంజీవ్‌ను కోరింది. సంజీవ్ రూ.32వేలు తీసుకొని రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి విక్కుర్తి కనుకయ్య సహాయంతో కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రి పేరుతో నకిలీ వైద్యపత్రాలు తయారుచేసి ఇచ్చారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో దేవమ్మ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంది. కలెక్టర్ సర్టిఫికెట్లపై విచారణకు ఆదేశించగా నకిలీవని తేలింది. గాలిపెల్లి పశువైద్యాధికారిణి కొండ ఇందిర ఫిర్యాదు మేరకు దేవమ్మ, సంజీవ్‌లను మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.15వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన అడువాల నాగరాజు 2017 సంవత్సరంలో అదే మండలంలోని ఓ గ్రామంలో ఒంటరిగా ఉన్న ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు బెదిరింపులకు గురి చేశాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి నాగరాజుకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

జగిత్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అల్లకొండ రాజవ్వ(70) అనే వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. జగిత్యాల పట్టణంలోని చిలుకవాడకు చెందిన రాజవ్వ ఈ నెల 10న తన ఇంటి నుంచి బయటకి వెళ్లి ప్రధాన రహదారి దాటుతుండగా ఓ కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలికి తీవ్ర గాయాలు కాగా జగిత్యాల ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. తొమ్మిది రోజుల అనంతరం మృతి చెందింది. ప్రమాదానికి కారకుడైన కారు నడిపిన సాయి వివేక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.


అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

జగిత్యాలరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన మతలాపురం రాజం (55) అనే రైతు అప్పుల బాధతో మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. సాగుకు, ఇంటి అవసరాలకు రూ.10 లక్షల వరకు అప్పులు కావడంతో వాటిని తీర్చలేక నిత్యం తీవ్ర మనస్థాపం చెందేవాడు. మంగళవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంగళసూత్రం అపహరణ

మెట్‌పల్లి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ అమ్మ వారి దర్శనానికి వచ్చిన మహిళ మెడలోంచి అగంతకుడు బైక్‌పై వచ్చి వెనుక నుంచి మంగళసూత్రాన్ని అపహరించాడు. మంగళవారం నిర్మల్ జిల్లా మునిపల్లి మండలంలోని లక్ష్మణచంద గ్రామానికి చెందిన దొండ రమ్య భర్త, కొడుకుతో కలిసి వెల్లుల్ల ఎల్లమ్మ ఆలయానికి దర్శనానికి మంగళవారం వచ్చారు. దర్శనం అనంతరం వంట చేసుకుని తన కొడుకుకు తినిపిస్తుండగా బైక్‌పై వచ్చిన అగంతకుడు కొంత దూరంలో ఆపి నడుచుకుంటూ వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుని వెళ్లాడు. ఎస్సై కిరణ్‌కుమార్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్హులకు అందని కిసాన్ సమ్మాన్



ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న రైతులు

PM KISAN SAMMAN NIDHI

PM KISAN YOJANA

హుజూరాబాద్‌రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం ఉన్నా కేంద్రం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన (పీఎం కేఎస్‌వై) ప్రారంభించింది. ఎంత భూమి ఉన్నా పట్టాదారు పుస్తకం ఉన్న వారికి ఏడాదికి మూడు విడతల్లో కలిపి రూ. 6 వేలు ఖాతాల్లో జమ చేస్తోంది. 2019 ఫిబ్రవరి 1 వరకు కటాఫ్ విధిం చింది. అప్పట్నుంచి కొత్తగా భూములు కొన్న, వారసత్వంగా పొందిన అన్నదాతలకు ఈ పథకం వర్తించడం లేదు. 2018లో భూ ప్రక్షాళన అయ్యాక కొందరి భూములు మిస్సింగ్ పడడంతో తగిన ఆధారాలు చూపి పట్టాదారు పాసు పుస్తకాలు పొందారు. వీరికి కిసాన్ సమ్మాన్ యోజన వర్తించడం లేదు.

కటాఫ్ తేదీలో వర్తించని పథకం

ఈ ఏడాదికి సంబంధించి మొదటి విడత కింద కేంద్రం ఫిబ్రవరిలో మండలంలో 9,282 మంది రైతులకు 55,692,000 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. కొత్త వారు మాత్రం ఏడేళ్లుగా నష్ట పోతున్నారు. కటాఫ్ తేదీని తొలగించి పెట్టుబడి సాయం అందిస్తామని ఇటీవల ఓ కేంద్రమంత్రి ప్రకటించిచడంతో పథకానికి దరఖాస్తు చేసుకున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మండలంలోని 19 గ్రామ పంచా యతీల్లో కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన, భూ మార్పిడి చేసుకున్న వారు ఉన్నారు. 1,322 మంది పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కోసం దరఖాస్తు చేసుకో గా 430 మంది రైతులు అర్హులుగా వ్యవసాయాధి కారులు గుర్తించారు. ఈ మేరకు రైతు వేదికల్లో వ్యవ సాయ విస్తీర్ణాధికారులతో అవగాహన కల్పించారు. ఏఈవోల ద్వారా లేదంటే మీ సేవ కామన్ సర్వీస్ సెంటర్లలో నమోదు చేసుకుంటే సాయం అందు తుందని తెలిపారు.

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తేనే..

చాడ భూమిరెడ్డి, ఏవో, హుజూరాబాద్



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి మండలంలో అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన జరిగింది. రైతులు ఆందోళన చెందొద్దు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తే అర్హులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తింపచేస్తాం.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బోయినపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని రాస్తారోకో చేపట్టారు. ఈ సంఘటన బోయినపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం.. గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన మల్లేశం(42) బోయినపల్లిలో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి గొర్రెల మంద వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువులు బోయినపల్లి రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. వాహన డ్రైవర్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన ఒకరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.9వేల జరిమానా, గాయపడిన బాధితులకు రూ.30 వేల పరిహారం చెల్లించాలంటూ జగిత్యాల కోర్టు రెండవ అదనపు జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన పోతర్ల రవి 2019 మే 15న తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వేములవాడ నుంచి కొడిమ్యాల వైపు వస్తున్నాడు. మ్యాకల అంజయ్య అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా, అతి వేగంగా నడుపుతూ నల్లగొండ శ్రీలక్ష్మి నృసింహస్వామి ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న రవి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో రవితో పాటు అతని కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి కొడిమ్యాల ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి మ్యాకల అంజయ్యకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఆస్తి కోసం అమ్మమ్మను చంపిన దత్తపుత్రుడు

- వెంకటమ్మ హత్య కేసులో వీడిన మిస్టరీ.. నిందితుడి అరెస్టు
- ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్

కరీంనగర్ క్రైం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కొత్తపల్లి శివారులో కెనాల్ వద్ద ఈ నెల 15న జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితుడు ఆమె దత్తత తీసుకున్న మనువడేనని, ఆస్తి కోసం హత్య చేసినట్లు విచారణలో తేలిందని కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్, కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో వసుంధర యాదవ్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌కు చెందిన వృద్ధురాలు తనుకు వెంకటమ్మ(70)కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు కుమారుడు చంద్రశేఖర్‌ను దత్తత తీసుకొని వివాహం చేసింది. వెంకటమ్మ వద్ద ఉన్న బంగారం, డబ్బులు కూతుళ్లకు ఇస్తుందని, తనకు ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని చంద్రశేఖర్ తరచూ ఆమెతో గొడవపడేవాడు. వెంకటమ్మతో గొడవపడిన చంద్రశేఖర్ ఏడాది కాలంగా కరీంనగర్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. ఎలాగైనా వెంకటమ్మను చంపాలని, తద్వారా ఆమె పేరిట ఉన్న ఆస్తి అంతా తనకు చెందుతుందని భావించాడు.ఈ నెల 15న వెంకటమ్మ కోహెడ మండలం రాంచంద్రాపూర్‌లో తన పెద్ద కూతురు లక్ష్మి వద్ద ఉండగా చంద్రశేఖర్(దత్తపుత్రుడు) ఆమెకు ఫోన్ చేశాడు. ఎల్ఐసీ డబ్బులు తీసుకునేందుకు కరీంనగర్‌కు రావాలని సూచించాడు. వెంకటమ్మ కరీంనగర్ బస్టాండ్‌కు రాగానే చంద్రశేఖర్ పథకంలో భాగంగా అప్పటికే స్నేహితుడి కారుతో సిద్ధంగా ఉన్నాడు. జగిత్యాల ఎల్ఐసీ కార్యాలయంలో డబ్బులు తీసుకుందామని నమ్మబలికి వెంకటమ్మను తీసుకువెళ్లాడు. అక్కడ సాయంత్రం వరకు గడిపి అధికారులు అందుబాటులో లేరని చెప్పి తిరిగి కరీంనగర్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో కొత్తపల్లి శివారులో అదను చూసి వెంకటమ్మపై కత్తితో దాడి చేయడంతో తీవ్రరక్తస్రావంతో ఆమె మరణించింది. చంద్రశేఖర్‌ను అనుమానించిన పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం రాత్రి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.



ఘటన స్థలంలో పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్

డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి లబ్ధిదారులు

ఇల్లంతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తమను ఎంపిక చేసినా కేటాయించకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లలో చేరిపోయారు. గత ప్రభుత్వం మండల కేంద్రంలో 40డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. పలుసార్లు గ్రామసభలు నిర్వహించి రెండు సంవత్సరాల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేశారు. అప్పటి నుంచి రోడ్డు సౌకర్యం లేదని, ఇతర వసతులు లేవని పంపిణీ చేయడం లేదు. నిర్మాణం జరిగిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అధికారులు గదులకు తాళాలు వేసి వచ్చారు. అధికారులు ఇళ్లను కేటాయించకపోవడంతో అసహనం చెందిన 10మంది లబ్ధిదారులు మంగళవారం గదులకు వేసిన తాళాలను పగలగొట్టి తమ సామగ్రిని ఇళ్లలో ఉంచి తాళాలు వేసుకొని వచ్చారు. అద్దె ఇళ్లలో తాము ఇబ్బందులు పడుతున్నందున ఇలా చేయవలసి వచ్చిందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా లబ్ధిదారులు డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి పోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ లేదు. రోడ్డును ఇటీవలే పూర్తి చేశారు.



డబుల్‌బెడ్‌రూంలలో ఉన్న లబ్ధిదారులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అజయ్‌కుమార్ (ఫైల్)

చిట్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురం తండా ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ (24) వ్యక్తిగత పని నిమిత్తం భూపాలపల్లికి బయల్దేరాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అజయ్ కుమార్ అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



అజయ్ (ఫైల్)

పాలకుర్తి,మార్చి 18(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్‌లోని వారుతినగర్‌కు చెందిన ఆరె అజయ్ (24) అనే యువకుడు మంగళవారం సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యం బారినపడడంతో తనకు ఏదో అంతు చిక్కని వ్యాధి సోకిందని అభద్రతభావానికి గురయ్యేవాడు. మనస్తాపంతో ఉరివేసుకొన్నాడని, మృతుడి తండ్రి ఆరె లక్ష్మన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇల్లందకుంట వాసికి రాష్ట్ర స్థాయి 35వ ర్యాంక్



పరుశురామ్

ఇల్లందకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన బీనవేన పరుశురామ్ గ్రేడ్-2 హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సోమవారం విడుదల చేసిన గ్రేడ్-2 హాస్టల్ వేల్ఫేర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 35వ ర్యాంక్ సాధించి హాస్టల్ వార్డెన్ అధికారిగా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పరుశురామ్‌ది పేద రైతు కుటుంబం. చిన్ననాటి నుంచి కష్టపడి చదివి 2023లో పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం పరుశురామ్ కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



ప్రజ్ఞాన్ (ఫైల్)

సైదాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మకల్ గ్రామానికి చెందిన ఎలబోయిన చైతన్య-సురేష్ దంపతులకు ప్రజ్ఞాన్ (2) ఒక్కగానొక్క కుమారుడున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రజ్ఞాన్ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయాడు. ప్రజ్ఞాన్ కనబడడం లేదని కుటుంబ సభ్యులు వెతుకగా, నీటి సంపులో పడి కనిపించాడు. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం హుజూరాబాద్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

పాఠశాల ఆవరణలో మద్యం సేవించిన సర్వీస్ పర్సన్ తొలగింపు

చందుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణలో ఓ పదో తరగతి విద్యార్థితో మద్యం సేవించిన సర్వీస్ పర్సన్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ సంఘటన చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వీస్ పర్సన్‌గా పనిచేస్తున్న బండి రాకేష్ పదో తరగతి విద్యార్థితో కలిసి పాఠశాల ఆవరణలో ఎవరూలేని సమయంలో మద్యం సేవిస్తూ, విద్యార్థులను దురలవాట్లకు పురిగొల్పుతున్న విషయం జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు దృష్టికి వెళ్లింది. దీంతో వెంటనే స్పందించిన డీఈవో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జితేందర్‌తో మాట్లాడి సర్వీస్ పర్సన్‌ను తొలగించాలని మౌఖికంగా ఆదేశాలు చేశారు. దీంతో డీఈవో ఆదేశాల మేరకు సర్వీస్ పర్సన్‌ను విధుల నుంచి తొలగించినట్లు మండల విద్యాధికారి వినయ్ కుమార్ తెలిపారు.

మండలాల పునర్విభజన తెచ్చిన తంటా



- ఇబ్బందులు పడుతున్న మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడ గ్రామాల ప్రజలు
- ఎండపల్లి మండలంలో రెవెన్యూ సేవలు
- పోలీస్‌స్టేషన్ పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లో..
- వెల్గటూర్ మండలంలో వైద్య సేవలు

ఎండపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలాల పునర్విభజనతో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు వివిధ రకాల సేవల కోసం మూడు ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు గ్రామాల రెవెన్యూ సేవలు ఎండపల్లి మండలంలో, వైద్య సేవలు వెల్గటూర్ మండలంలో, పోలీస్ సేవలు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో కొనసాగుతున్నాయి. మూడు గ్రామాలు గతంలో వెల్గటూర్ మండలంలో ఉండేవి. 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పాలకుర్తి గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేసి మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడా గ్రామాలను అందులో విలీనం చేసింది. 2022లో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం తెరపైకి వచ్చింది. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని 12 గ్రామాలు, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని మూడు గ్రామాలతో నూతన మండలం ఏర్పడింది. దీంతో రెవెన్యూ, వైద్య, పోలీస్ మూడు కార్యాలయాలు మూడు దిక్కులు అయ్యాయి. మండలం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు పూర్తి కార్యాలయాలు ఏర్పడలేదు. దీంతో మూడు గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండపల్లి మండలానికి కొత్త పోలీస్ స్టేషన్ మంజూరు అయ్యే వరకు వెల్గటూర్ స్టేషన్‌లోనైనా ఈ మూడు గ్రామాలను విలీనం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

పల్లె అశోక్, మాజీ సర్పంచ్, ముంజంపల్లి



మా గ్రామానికి సంబంధించి రెవెన్యూ, వైద్యం, పోలీసు శాఖలు మూడు మండలాల కలయికతో ఉన్నాయి. దీంతో గ్రామస్థులు వివిధ పనుల కోసం మూడు ప్రాంతాలకు వెళ్లలేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కొత్త మండలానికి పోతే మీ గ్రామం పాత మండలంలోనే ఉందని, పాత మండలానికి పోతే మీది కొత్త మండలంలో ఉందని అధికారులు చెప్పడంతో ఏమీ చేయలేక ఇక్కట్లు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు మా సమస్యను తొందరగా పరిష్కరించాలి.

మావి ఎటుకాని బతుకులు అయ్యాయి

కొమ్ము శ్రీకాంత్, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు



నూతన మండలం ఏర్పడినపుడు మా సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్నాం కాని ఇంకా పెరిగాయి. పోలీస్ స్టేషన్ పరిధిని బసంత్ నగర్ నుంచి మార్చి కొత్త స్టేషన్ ఏర్పడే వరకు వెల్గటూర్‌లోనైనా కలపండి. మావి ఇప్పుడు ఎటు కాని బతుకులు అయ్యాయి.

దేశం గర్వపడేలా క్రీడాకారులు ఎదగాలి

- హుజూరాబాద్‌లో టర్ఫ్ కోర్ట్ ఏర్పాటుకు కృషి
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్
- ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు
- విజేతగా మెదక్.. రన్నరప్‌గా నిజామాబాద్ జట్టు


విజేతగా నిలిచిన మెదక్ జట్టుకు కప్‌ను అందజేస్తున్న వొడితెల ప్రణవ్, ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు దేశం గర్వపడేలా ఆటలు ఆడి ఎదగాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మూడురోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ హుజూరాబాద్ వేదికగా అనేక రకాలన క్రీడా టోర్నమెంట్‌లు జరగాలన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో విద్యా, వైద్యంతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, మైదానాలకు సరిపడా నిధులు కేటాయిస్తామన్నారు. హుజూరాబాద్‌లో టర్ఫ్ కోర్ట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టోర్నమెంట్ నిర్వహించిన ఆర్గనైజింగ్ సెక్రెటరీ, క్లబ్ సభ్యులను అభినందించారు.

అనంతరం ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించు కోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. గెలుపొందిన జట్లకు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఆర్గనైజర్లు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ సెక్రటరీ భీమ్‌సింగ్, రాష్ట్ర హాకీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కళ్యాణి, జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రటరీ సురేందర్‌సింగ్, బి శ్రీనివాస్, తోట రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, ఉమామహేశ్వర్, టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, శ్రీనివాస్, పవన్, పీటీలు శ్యాంసుందర్, రవికుమార్, విశ్రాంత, రాజిరెడ్డి, ప్రభాకర్, తిరుపతి, సజ్జు, సాయికృష్ణ, రాకేష్, రాజేష్, విక్రమ్, సాంబరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

హుజూరాబాద్‌లోని హైస్కూల్ మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు చివరిరోజు హోరాహోరీగా సాగాయి. కరీంనగర్, మెదక్, హైద్రాబాద్, నిజామాబాద్ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీ ఫైనల్స్‌లో కరీంనగర్‌పై మెదక్ 3-1తో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. రెండో సెమిఫైనల్స్ హైద్రాబాద్‌పై నిజామాబాద్ 1-0తో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. థర్డ్ పేస్ కోసం హైద్రాబాద్, కరీంనగర్ జట్లు తలపడగా ఇరుజట్లు చెరొక గోల్ చేయడంతో డ్రాగా ముగిసింది. ఎంపైర్లు స్ట్రోక్ ద్వారా విజేతను నిర్ణయించేందుకు ఇరుజట్ల కెప్టెన్లతో సంప్రదించి నిర్ణయం తీసుకున్నారు. హైద్రాబాద్‌లో 4గోల్స్ చేయగా, కరీంనగర్ 2 గోల్స్ చేయడంతో హైద్రాబాద్ గెలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో మెదక్- నిజామాబాద్ జట్లు పోటీపడగా 4-1తో మెదక్ విజయం సాధించి విజేతగా నిలిచింది. రన్నరప్‌గా నిజామాబాద్, మూడో స్థానంలో హైద్రాబాద్ సరిపెట్టుకుంది.

కొండగట్టులో టెండర్లు ఖరారు

మల్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే పలు దుకాణాలకు మంగళవారం నిర్వహించిన పలు టెండర్లు ఖరారు అయ్యాయి. ఏడాది కాల పరిమితితో హోటల్, ఫొటో స్టూడియో, సామాన్లు భద్రపరచుకునే హక్కు, స్నానాలు, మరుగుదొడ్లు, కిరాణం, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం, చెప్పులు భద్రపరచడం, వంట చెరుకు అమ్మకం, పాదరక్షలు, టాయిలెట్స్ నిర్వహణకు ఈ-టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగవేలం నిర్వహించారు. ఈ వేలంలో హోటల్ నిర్వహణకు రూ.18.25లక్షలు, కిరాణ సామగ్రి రూ.12.15లక్షలు, కూల్‌డ్రింక్స్ రూ.16.50 లక్షలు, లాకర్‌రూం రూ.18లక్షలు, ఫొటో స్టూడియో రూ.22 లక్షలు, వంట చెరుకు రూ.80వేలు, పాద రక్షలకు రూ.9,99,999, మామిడి తోట నిర్వహణకు రూ.10వేలకు ఖరారు అయినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. అలాగే గుట్ట కింది దుకాణం-10కి రూ.56వేలు, దుకాణం-13కు రూ.55వేలు పలికినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహర నాథ్, చంద్రశేఖర్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

ఓసీల్లోని పేదలకు 'రాజీవ్ యువ వికాస్' వర్తింపజేయాలి

ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు


మాట్లాడుతున్న పొలాడి రామారావు

కరీంనగర్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అగ్రకులాలు (ఓసీ)ల్లో ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వర్తింపజేయాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో ఓసీ జేఏసీ నాయకులతో ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడారు. ఓసీల్లోని పేదలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు విధివిధానాలను పాలకమండలిని ఇప్పటి వరకు ప్రకటించకపోవడం సరికాదన్నారు. నిరుద్యోగయువతకు ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం హర్షనీయమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఓసీ సామాజిక నిరుద్యోగ యువతకు వర్తింపజేయక పోవడం శోచనీయమన్నారు. జేఏసీ నాయకులు నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, స్వామిరెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాజన్న, సమ్మిరెడ్డి, సంపత్‌రావు, గోపాల్‌రావు, సరోజనా జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



క్షయ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- పెద్దపల్లి జిల్లాలో వంద రోజుల ప్రణాళిక
- గ్రామ గ్రామాన సర్వే, వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- ఉచితంగా మందుల పంపిణీ
- జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో పెద్దపల్లి జిల్లా ఎంపిక
- గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంగా కార్యాచరణ

సుల్తానాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసింది. వాటి పరిధిలో క్షయ రహిత జిల్లాలుగా తీర్చదిద్దడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాను ఎంపిక చేసింది. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీ వేదికగా జిల్లాలో టీబీ నిర్మూలన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. టీబీ లేని జిల్లాగా మార్చడానికి చర్యలు ప్రారంభించారు. ప్రాణాంతకమైన క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు పీహెచ్‌సీలలో వంద రోజుల కార్యక్రమాన్ని అమలు చేసి క్షయ రహిత రాష్ట్రంగా చేయడానికి క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టింది. దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి దేశ వ్యాప్తంగా 347 ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేసింది. తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది కేంద్రాలను సెలక్ట్ చేయగా అందులో పెద్దపల్లి జిల్లా ఉంది. అత్యధిక క్షయ రోగులు ఉన్న పెద్దపల్లి జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేశారు. వంద రోజులలో రోజు వారి ప్రణాళిక ప్రకారం అనుమానితులను గుర్తించడం, వారికి పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ అనంతరం అవసరమైన మందులను ఇస్తూ వాటిని క్రమం తప్పకుండా వాడేలా ప్రోత్సహించడం వంటి చర్యలను ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పర్యవేక్షిస్తున్నారు. మందులతో పాటు వారు పౌష్టికాహారం తీసుకునేలా చూడడం వీరి బాధ్యతే. క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వంద రోజులలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.


గర్రెపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం

రూ.25 లక్షలతో పౌష్టికాహారం పంపిణీ

ఎస్ ఫణిశంకర్, రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ అసోసియేషన్ అధ్యక్షులు


రోగులు సత్వరంగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడమే లక్ష్యంగా టీబీ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం సూచించింది. ఈ పౌష్టికాహారాన్ని సమకూర్చడానికి తమ సంస్థ ద్వారా రూ.25 లక్షలను ఇచ్చాం. తద్వారా 3000 కిట్లను సమకూర్చి వాటిని అభయ ఫౌండేషన్ వారికి అప్పగించారు. వారు ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరు నెలల పాటు రోగులకు నెల నెలా పౌష్టికాహారాన్ని అందజేస్తారు. ఒక్కొక్క కిట్‌లో ఏడు వందల రూపాయల విలువ చేసే ప్రొటీన్ పౌడర్, దాంతో పాటు కొర్రలు, మంచి బియ్యం, పప్పులు, చక్కెర, నూనె వస్తువులు ఉంటాయి.

టీబీ సోకిన వారు జాగ్రత్తగా వ్యవహరించాలి : గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్



క్షయ ప్రాణాంతకమైన వ్యాధి. పైగా అంటువ్యాధి కూడా. సరైన సమయంలో గుర్తించి కుటుంబ సభ్యులు దూరంగా ఉంటూ మందులు వాడుతూ బలమైన ఆహారాన్ని తీసుకోవాలి. తెమడ, ఎక్స్‌రే వంటి పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి ముదరక ముందు ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. గతంలో టీబీ వచ్చి తగ్గిన వారు మిగతా వారికి సహకరించాలి. రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలి. ఇతరులకు దగ్గరగా తుమ్మడం, దగ్గడం వంటివి చేయకూడదు. తుంపర్ల ద్వారా ఆ వ్యాధి ఇతర కుటుంబ సభ్యులకు సోకే ప్రమాదం ఉంది. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయకూడదు.


పంపిణీకి సిద్ధం చేసిన కిట్లు



టీబీ రహిత రాష్ట్రంగా చేయాలి

వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరక్టర్ రాజేశం



టీబీని రాష్ట్రం నుంచి పారదోల డానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ క్షయ నిర్మూలన పథకం అమలు చేస్తుంది. రాష్ట్రంలో టీబీ కేసు లు లేకుండా చేయడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వంద రోజుల కార్యక్రమాన్ని గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంలో ప్రారంభించారు. అన్ని పీహెచ్‌సీల పరిధిలో రోగులను గుర్తించి మందులు ఇస్తున్నాం. ఆకలి లేకపోవడం, సన్నబడడం జ్వరం రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఏఎన్‌ఎంను ఆశాలను సంప్రదించాలి. రాష్ట్రంలోని పలు జిల్లాలను పరిశీలించిన అనంతరం పెద్దపల్లి జిల్లాను ఎంపిక చేశాం. దేశంలోనే టీబీ రోగులు అధికంగా ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ఇచ్చాయని, దాంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టి 2030కల్లా టీబీని నిర్మూలించేందుకు ప్రధానమంత్రి లక్ష్యంగా నిర్ణయించారు. అంతకన్నా ముందే లక్ష్యాన్ని చేరుతాము. క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయడానికి కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రామగుండం కేంద్రంలో రూ.25 లక్షలతో మొబైల్ ఎక్స్‌రే మిషన్ సమకూర్చారు. రోగులకు సౌలభ్యంగా వారి వద్దకే వెళ్లిఎక్స్‌రేలు తీస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి తోడు అభయ ఫౌండేషన్ వారు తమ సేవలను అందిస్తున్నారు. దాతలు సమకూర్చిన పౌష్టికాహారాన్ని ఆరు నెలల పాటు ఆయా పీహెచ్‌సీల పరిధిలో పంపిణీ చేస్తున్నారు.

లక్ష్యానికి మించి క్షయ పరీక్షలు

అన్నప్రసన్న కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంగా వ్యాధి నిర్మూలన చర్యలు చేపట్టాం. జిల్లాలో నిర్వహిస్తున్న నిక్షయ్ శివిర్ వంద రోజుల కార్యక్రమంలో హైరిస్కు జనాభాగా లక్షా 19 వేల 746 మందిని గుర్తించాం. లక్ష 22 వేల 421 మందికి టీబీ స్క్రీనింగ్ టెస్టులు చేశాం. వీరిలో 12 వేల 635 మందిని అనుమానితులుగా గుర్తించాం. జిల్లాలో మొత్తం 426 మందిని క్షయ వ్యాధిగ్రస్తులుగా గుర్తించాం. గతంలో ఉన్న 74 మందితో ప్రస్తుతం జిల్లాలో 500 మంది క్షయ రోగులు ఉన్నారు. జిల్లాలోని బేగంపేట ఆరోగ్య కేంద్రం పరిధిలో 25 మంది, ఎలిగేడ్‌లో 16, గద్దలపల్లిలో 83, గర్రెపల్లిలో 64, జూలపల్లిలో 25, కమాన్‌పూర్‌లో 31, కొలనూర్‌లో 3, నంది మేడారంలో 51, ముత్తారంలో 23, ఓదెలలో 20, రాఘవపూర్‌లో 42 మంది, రాగినేడులో 85 మంది, శ్రీరాంపూర్‌లో 23 మంది రోగులను గుర్తించి వారికి నెల నెలా మందులతోపాటు ఉచితంగా పౌష్టికాహారం కిట్లను అందిస్తున్నాము.


రోగులకు పంపిణీ చేసే కిట్లలోని సరుకులు

శివ కల్యాణం సందర్భంగా స్వామివారి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఉద్యోగులు, అర్చకులు, దేవరాజు నాగార్జున్‌కు రాజన్న చిత్రపటం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజు శివ కల్యాణోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి తీర్థరాజస్వామి పూజ, బలిహరణము నిర్వహించారు. స్వామి వారికి ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నుంచి ఔపాసనము బలిహరణము రాత్రి 8.15 గంటలకు కల్యాణ మండపంలో సదస్యము, అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు మట్టి పాత్రల్లో అమ్మవారికి నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా శివసత్తుల నృత్యాలతో అమ్మవారి ఆలయాన్ని చేరుకుని పట్నాలు, ఒడిబియ్యం, నూతన వస్త్రాలు సమర్పించారు.

రాజన్నను దర్శించుకున్న స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని రిటైర్డ్ జస్టిస్, స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ దేవరాజు నాగార్జున్ మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా ఆలయ అర్చకులు, వేద పండితులు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొని కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో వినోద్ రెడ్డి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు. వెంట ఏఈవో బ్రహ్మన్న గారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీకాంతచారి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నరేందర్ జూనియర్ అసిస్టెంట్ సంహాచారి ఉన్నారు.


బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

వేంకటేశ్వరుడి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు

ధర్మపురి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేంకటేశ్వరస్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారల ఉత్సవమూర్తులను దక్షిణ దిశలో గల పోలీస్ స్టేషన్, ఉత్తర దిశలో గల ఉసిరిక వాగు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి దంపతులు, ఎస్ఐ ఉదయ్‌కుమార్ దంపతులు, బుగ్గారం ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి దంపతులు, వెల్గటూర్, గొల్లపల్లి ఉమాసాగర్, సతీష్ దంపతులు, పోలీస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు.

ఎనిమిదో రోజు ఆదాయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయానికి రూ.3,88,685 ఆదాయం లభిం చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. వీటిలో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.2,94,168 ప్రసాదాల విక్రయం ద్వారా రూ.85,500 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ.9,016 విరాళాలు సమర్పిం చినట్లు ఆయన వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 3 గంటలకు రథోత్సవం ఉంటుంది. రాత్రి 7 గంటలకు చక్రతీర్థం, 9 గంటలకు స్వామివారల పుష్పయాగం ఉంటుంది. స్థానిక శేషప్ప కళా వేదికపై శ్రీరాంభట్టర్ భాగవతార్ హరికథ కాలక్షేపం ఉంటుందని ఈవో శ్రీనివాస్ తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో ప్రముఖులు

లక్ష్మీ నరసింహస్వామి వారిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు. ఆయన వెంట ఎస్‌బీఐ డీజీఎం బిజయ్‌కుమార్ సాహు, గోదావరిఖని ఆర్ఎం రవీంద్రకుమార్, మంచిర్యాల ఆర్ఎం రితేష్‌కుమార్, ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

- లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని కామినేని హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్ కుటుంబ సమేతంగా మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ దేవాలయంలో జరిగే అన్నదానం కోసం రూ.1,00,000 విరాళాన్ని అందించారు.


వేంకటేశ్వరస్వామి వారల ఊరేగింపు సేవ

సైకిల్‌కు స్టీరింగ్


సైకిల్‌కు స్టీరింగ్ ఏర్పాటు చేసిన జాషువా



జగిత్యాల అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన కొండ జాషువా అనే 8వ తరగతి విద్యార్థి తన సైకిల్‌కు స్టీరింగ్ అమర్చాడు. ఇంట్లో ఉన్న ఓ పాత స్టీరింగ్ తీసుకుని బ్రేక్‌లు చేతులకు అనుకూలంగా ఉండేలా అమర్చాడు. సైకిల్‌కు బ్యాటరీ సైతం అమర్చి హారన్ పెట్టాడు. పట్టణంలోని రోడ్లపై స్టీరింగ్ సైకిల్‌తో హారన్ కొడుతూ తిరుగుతున్న సదరు బాలుడి సైకిల్‌ను జనాలు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ ఆలోచన ఎలా వచ్చిందని ప్రశ్నించగా ఇంట్లో పనికి రాకుండా ఉన్న పాత స్టీరింగ్ తీసుకుని స్నేహితుడి సహాయంతో సైకిల్‌కు స్టీరింగ్ అమర్చానని, నడపడానికి అనుకూలంగా ఉందని జాషువా తెలిపాడు.

కుక్కకాటుకు గురైన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి

- గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి
- ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకుల ధర్నా

సిరిసిల్ల రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కుక్కకాటుకు గురైన విద్యార్థి సువర్ణకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఈ సంఘటనకు కారుకులైన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, మల్లారపు ప్రశాంత్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గురుకుల పాఠశాలను విద్యార్థిని తల్లిదండ్రులు డెవిడ్‌రాజు-కృపారాణిలతో కలిసి నాయకులు సందర్శించి పరిసరా లను పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రధాన ద్వారం ఎదుట మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీతో పాటు ఏబీవీపీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నాయకులు ధర్నాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గురు కుల పాఠశాలలోకి కుక్కలు వెళ్లి విద్యార్థులపై దాడిచేసి గాయ పర్చడం బాధాకరమన్నారు. కలెక్టర్ స్పందించి గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. కుక్క కాటుకు గురైన సువర్ణకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సువర్ణను ఎస్ఎఫ్ఐ నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్ కుమార్, నాయకులు రాకేష్, మనోఅభిషేక్, వినయ్ పాల్గొన్నారు.



చిన్నబోనాల గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గురుకుల పాఠశాలలో కుక్క కాటుకు గురైన విద్యార్థికి వైద్యం అందించడంతో పాటు అ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదు కోవడంతోపాటు నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌తో పాటు వాచ్‌మన్, అటెండర్‌లను సస్పెండ్ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు డిమాండ్ చేశారు. చిన్నబోనాల గురుకుల పాఠశాల ఎదుట ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ కార్యదర్శి ఎనుగందుల శ్రీనివాస్, పూసాల కార్తీక్, గణేష్, పాకచరణ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షల నిర్వహణ

పోతు ప్రభాకర్, ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పదో తరగతి పరీక్షలు నిర్వహణ ఎలా?

ఎంఈవో: పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రంలో సీసీ కెమరాల పర్యవేక్షణతో పాటు పోలీస్ బందోబస్తు ఉంటుంది. సెంటర్ నుంచి 100 మీటర్ల పరిధి వరకు ఎవరినీ అనుమతించం. ప్రతి సెంటర్ వద్ద బీఎన్ఎస్ఎస్-163 సెక్షన్ అమలులో ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: మండల వ్యాప్తంగా ఎన్ని సెంటర్లు, ఎంత మంది పరీక్ష రాస్తున్నారు?

ఎంఈవో: మొత్తం 5 సెంటర్లు ఉన్నాయి. ధర్మారం ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలతోపాటు మేడారం, దొంగతుర్తిలోని ఉన్నత పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో సెంటర్లు నిర్వహిస్తున్నాం. మొత్తం 17 పాఠశాలల నుంచి 746 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

ఆంధ్రజ్యోతి: సెంటర్లలోకి విద్యార్థులను ఎప్పుడు అనుమతిస్తారు?

ఎంఈవో: పరీక్ష ఉదయం 9.30 నుంచి 12.30 వరకు ఉంటుంది. గంట ముందు సెంటర్‌కు చేరుకోవాలి. మొదటి రోజు గంట ముందు, మిగతా రోజుల్లో అరగంట ముందు అనుమతిస్తాం. సెంటర్లలో మంచి నీటి వసతి, ఓఆర్ఎస్‌లు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: పరీక్ష రాసే విద్యార్థులకు నియమ నిబంధనలు ఉన్నాయా?

ఎంఈవో: ప్రతి విద్యార్థి బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నియమ నిబంధనలు పాటించాల్సిందే. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకు రాకూడదు.

- ధర్మారం, (ఆంధ్రజ్యోతి)

కేసీఆర్ మెప్పు కోసమే చందర్ పాదయాత్ర

కళ్యాణ్‌నగర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ మెప్పు కోసమే కోరుకంటి చందర్ పాదయాత్ర చేస్తున్నాడే తప్ప ప్రజలకు చేసేదేమి లేదని టీఆర్ఎస్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి శంకర్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి కన్నీటి గోస పేరిట పాదయాత్ర చేస్తున్నారని, నియోజకవర్గంలో తాగునీటి సమస్య కోసం అసెంబ్లీకి పాదయాత్ర చేస్తే బాగుండేదని, రామగుండం ప్రజలను గందరగోళంలో పడవేయడానికి ఈ కార్యక్రమాన్ని చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వాలి కానీ, కేసీఆర్‌కు ఇస్తే లాభం ఏమిటని ప్రశ్నించారు. నాయకులు కనుకుంట్ల రమేష్, ఈదునూరి నర్సింగ్, బిక్షపతి, స్వరూప, శివ కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలో ట్విన్నింగ్ కార్యక్రమం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పెగడపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం ట్విన్నింగ్ కార్యక్రమం జరిగింది. పెగడపల్లితోపాటు అంకంపల్లె, మడిపల్లె పాఠశాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. డిజిటల్ విధానంతో నిర్వహించే బోధన అభ్యాస ప్రక్రియను విద్యార్థులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహేష్, ప్రధానోపాధ్యాయులు కడారి నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఊరట

రెగ్యులరైజేషన్ చార్జీల చెల్లింపులకు వెసులుబాటు ● దరఖాస్తుదారులకు ఉపశమనం

కోల్‌సిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సామాన్యులకు గుదిబండగా మారిన ఎల్ఆర్ఎస్ విషయంలో దరఖాస్తుదారులకు ప్రభుత్వం కొంత ఊరటనిచ్చింది. ఈనెల 31వ తేదీలోపు చెల్లిస్తే 25శాతం రాయితీ ప్రకటించిన ప్రభుత్వం తాజాగా మొత్తం ఫీజులో రెగ్యులరైజేషన్ చార్జీలు చెల్లించినా ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్ ఇచ్చేలా వెసులుబాటు కల్పించారు. 14శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు ప్రస్తుతం చెల్లించకుండానే రెగ్యులరైజేషన్ ఫీజు చెల్లించినా పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ మేరకు ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో కూడా ఫీజు ఆప్షన్ పెట్టారు. దీంతో దరఖాస్తుదారులకు ఉపశమనం కలుగనున్నది. జిల్లాలో ఎల్ఆర్ఎస్ చెల్లించేందుకు ఇప్పటివరకు దరఖాస్తుదారులు పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. ప్రస్తుతం కల్పించిన రెగ్యులరైజేషన్ చార్జీ చెల్లింపు అవకాశంతో దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉంది.

జిల్లాలో 25,513 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గ్రామాల్లో 5735దరఖాస్తులు రాగా మిగతావి రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపల్ పరిధిలో ఉన్నాయి. ఇందులో 25వేల దరఖాస్తుల్లో 4521దరఖాస్తులు ప్రొహిబిటెడ్ జాబితాలో ఉన్నాయి. ఇందులో అసైన్డ్, ప్రభుత్వ, ఇనాం, దేవాదాయ, వక్ఫ్ భూములు, చెరువులు, కుంటలు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని భూములు, హైటెన్షన్ వైర్ల కింద ఉన్న భూములు ఉన్నాయి. 16910 దరఖాస్తులకు ఫీజు అప్రూవల్ చేసి దరఖాస్తుదారులకు సమాచారం పంపారు. మరో 3568 దరఖాస్తులు మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదలశాఖ, ఆర్అండ్‌బీ తదితర శాఖల అప్రూవల్ లేకుండా పెండింగ్‌లో ఉన్నాయి. రామగుండం 7,078 దరఖాస్తులకు గాను 3920 దరఖాస్తులకు ఫీజు అప్రూవల్ చేశారు. ఇందులో ఇప్పటి వరకు కేవలం 245 దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇక మంథనిలో 895, పెద్దపల్లిలో 10269, సుల్తానాబాద్‌లో 1536 దరఖాస్తులు వచ్చాయి.

రెగ్యులరైజేషన్ చార్జీల వెసులుబాటుతో పరిష్కారానికి అవకాశం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు 25శాతం రాయితీతో పాటు కేవలం రెగ్యులరైజేషన్ చార్జీలు చెల్లించినా దరఖాస్తుల పరిష్కారానికి అవకాశం ఇవ్వడంతో దీన్ని వినియోగించుకునేందుకు దరఖాస్తుదారులు మొగ్గుచూపే అవకాశం ఉన్నది. ఎల్ఆర్ఎస్ ఫీజులో 15శాతం ఫీజు చెల్లిస్తే రెగ్యులరైజేషన్ ప్రొసీడింగ్ వచ్చే అవకాశం ఉంది. మిగతా 14శాతం చార్జీలు, ఇతర ఫీజులను భవన నిర్మాణ అనుమతుల సమయంలో చెల్లించుకునే వెసులుబటు కల్పించారు. చాలా మంది ప్రజలు ఖాళీ స్థలాలపై పెట్టుబడి పెట్టారు. ధర వస్తే అమ్ముకుందామనే ఆలోచనతో ఉన్నారు. వీరికి ఈ కొత్త వెసులుబాటు కలిసిరానున్నది. రెగ్యులరైజేషన్ ఫీజు వెసులుబాటు అవకాశంతో జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కారమయ్యే అవకాశం ఉన్నది.

బడ్జెట్‌పై ఆశలు..

(5వ పేజీ తరువాయి)

పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా హామీ ఇచ్చారు.

● 2.40 లక్షల ఎకరాలకు అందనున్న సాగునీరు

జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో గల ఎస్సారెస్పీ లక్షా 80 వేల ఎకరాలు, జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం, కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల్లోని 40 వేల ఎకరాలతో పాటు 10 నుంచి 20 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరందనున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రతీ సీజన్‌లో సాగు నీటిని వారబంధి పద్ధతిన విడుదల చేస్తున్నారు. కాలువ చివరి భూములైన ఓ దెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, రామగిరి, మంథని, రామగుండం మండలాల్లోని చివరి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందక పంటలు ఎండిపోతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పత్తిపాక వద్ద 5 నుంచి 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించినట్లయితే అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా చొప్పదండి మండలం రేవెల్లి హెడ్ రెగ్యులేటర్ వద్ద గల ఎస్సారెస్పీ కాలువకు లింక్ చేస్తే చివరి ఆయకట్టుకు సాగు నీరు అందనున్నదని ప్రతిపాదించారు. అయితే గత ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. రిజర్వాయర్‌ను నిర్మించాలని మంత్రితోపాటు ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందనే ఆశతో రైతులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

పెద్దపల్లి రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. టిఎస్పీవో అనుబంధ తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫోరం జిల్లా కార్యవర్గం మంగళవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కార్యదర్శుల సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు కార్యదర్శులు పర్యవేక్షించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. నిషాంత్ రావు, మహేందర్, చిలగాని శ్రీధర్, శ్రావణ్, శరత్‌బాబు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన కలెక్టర్



కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న పీటీ స్వామి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వీర్లపల్లెలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమాన్ని మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించారు. ఆశ్రమ నిర్వాహకులతో ఆశ్రమంలో ఉంటున్న వారి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం 25 మంది వృద్ధులు ఉండగా 50 మంది ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని తనవంతు సహకారాన్ని అందిస్తానని కలెక్టర్ నిర్వాహకులతో అన్నారు. ఆశ్రమానికి మినీ సోలార్ ప్లాంట్, విశ్రాంతి గదులు, ఆర్వో వాటర్ ప్లాంట్, అంబులెన్స్‌ను త్వరలో అందజేస్తామని కలెక్టర్ నిర్వాహకులకు తెలిపారు. జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌రావు, సీడీపీఓ అలేఖ్యపటేల్, ఎఫ్ఆర్వో స్వర్ణలత, నిర్వాహకులు పీటీ స్వామి, సత్తయ్య, లింగమూర్తి, వెంకటయ్య ఉన్నారు.

రైతు గుర్తింపు కార్డులకు కొలనూర్ ఎంపిక

నేడు రైతువేదికలో సమావేశం

ఓదెల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొలనూర్ గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వం పైలట్ గ్రామంగా ఎంపిక చేసింది. ఈ మేరకు బుధవారం ఇక్కడి రైతువేదికలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఏవో భాస్కర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 11 రాష్ట్రాల్లో రైతు గుర్తింపు కార్డులను అమలులో భాగంగా ఇక్కడ గుర్తింపు కార్డు కోసం చర్యలు తీసుకుంటున్నట్లు ఏవో తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతోపాటు పట్టాదారు పాసు పుస్తకం తీసుకొని రావాలని, రైతు వద్ద సెల్ ఫోన్ ఉండాలని కోరారు. 20న రైతు రిజిస్ట్రేషన్ ప్రారంభం అవుతుందని, రైతులు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. హైదరబాద్ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు హాజరవుతారని, కొలనూర్ రైతు వేదిక పరిధిలోని గ్రామాల రైతులు హాజరు కావాలని కోరారు.

నిరుద్యోగులపై చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వం

ముత్తారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులపై చిన్నచూపు చూస్తోందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోతుపెద్ద కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళలకు బస్సులు టెండర్లను ఇవ్వడం సంతోషకరమని అయితే ఆ టెండర్లను నిరుద్యోగులకు ఇస్తే బాగుండేదన్నారు. మహిళలకు ప్రకటించడంతో యువతను పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

పెద్దపల్లి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబొంకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు రాసే విద్యార్థులకు పీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెగడ రమేష్ యాదవ్ మంగళవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): నాగేపల్లి ప్రభుత్వ పాఠశాలలో రామిని రమేశ్ స్మారకార్థం ఆయన సోదరుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్, ఏరేజర్, స్కేల్‌లను మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారయణ గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహంగా రూ. 5వేలు అందజేస్తామని ప్రకటించారు. మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు, నాయకులు కుమార్‌యాదవ్, గద్దలశంకర్, కాపురబోయిన భాస్కర్, చెల్కల జవాహర్, ప్రభాకర్, ఒదెలు, బాలయ్య, మల్యాల సారయ్య పాల్గొన్నారు.

ఈనెల 21న వారసంత వేలం

ఎలిగేడు, మార్చి 18,(ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండల కేంద్రంలో ప్రతీ బుధవారం నిర్వహిస్తున్న వారసంత వేలం ఈనెల 21న నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి అంజలి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఈనెల 21న సాయంత్రం 5గంటలలోపు రూ.5000డిపాజిట్ చెల్లించాలని, గ్రామపంచాయతీలో ఎలాంటి బకాయిలు లేకుండ ఉన్నవారు అర్హులని ఆమె పేర్కొన్నారు. వేలంలో నెగ్గినవారు 50శాతం సొమ్మును మూడు రోజుల్లో చెల్లించాలని పేర్కొన్నారు. మిగిత సొమ్మును ఈనెల 31వరకు చెల్లించాలన్నారు. చిరు వ్యాపారులకు రూ.15, పెద్ద దుకాణదారులకు రూ.25చొప్పున వసూలు చేసుకునే వెసలుబాటు ఉంటుందని తెలిపారు.

పదో తరగతి విద్యార్థుల పూజలు



ఆలయంలో విద్యార్థినులు

ముత్తారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా బాలికల విద్యాలయం పదో తరగతి బాలికలు హనుమాన్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 21న జరగనున్న పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు బాలికలను ఆశీర్వదించారు. కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కుక్కలగూడూర్‌లో మాట్లాడుతున్న మనాలి ఠాకూర్

పాలకుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మక్కాన్‌సింగ్ సేవాసమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ అన్నారు. మంగళవారం పుట్నూర్, కుక్కలగూడూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనుల స్థలాలను పరిశీలించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ప్రతీ కూలీకి జాబ్ కార్డు అందించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

ఎండలు తీవ్రంగా ఉన్నాయని, పని స్థలాల్లో చల్లని తాగు నీరు అందుబాటులో ఉంచాలన్నారు. సంక్షేమ పథకాల్లో అర్హులైన వారి పేర్లు రాని వారు ఇస్తే ఎమ్మెల్యేతో మాట్లాడి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం తిరుపతి, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, పుట్నూర్, కుక్కలగూడూర్ అధ్యక్షులు తోట ప్రశాంత్, మేడం బాపు, ఫీల్డ్ అసిస్టెంట్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పుట్నూర్‌లో రామగుండం మార్కెట్ యార్డుకు కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.

సబ్‌స్టేషన్లలో బ్రేకర్‌ల ఏర్పాటు



బ్రేకర్ చార్జింగ్ పనులను ప్రారంభిస్తున్న ఎస్ఈ మాధవరావు

రామగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బేగంపేట్, రత్నాపూర్ గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన బ్రేకర్స్‌లను మంగళవారం ఎస్ఈ మాధవరావు ప్రారంభించారు. బేగంపేట్ సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ ఏర్పాటుతోపాటు బేగంపేట్ రూరల్ బ్రేకర్‌ను వేరు చేశారు. బ్రేకర్ సపరేషన్‌లను పూజల అనంతరం ఎస్ఈ ప్రారంభించారు. వ్యవసాయదారులకు విద్యుత్ అంతరాయం కల్గకుండా ప్రత్యేక ప్రణాళికల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఈ తెలిపారు. డీఈ ప్రభాకర్, ఏడీ కనకయ్య, ఏఈ మహేందర్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్లు, ఏఎల్ఎమ్‌లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరితగతిన చేపట్టాలి

పెద్దపల్లి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద తీసుకోగా గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని ఇందిరమ్మ ఇళ్ల పథకం పీడీ రాజేశ్వర్ అన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను పరిశీలించి ఇంటి నిర్మాణాలకు మార్కింగ్ చేయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీడీ సూచించారు. ఎంపీడీవో కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌లతో పాటు గ్రామ పంచాయతి సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీలో జాప్యం

ఓదెల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే జారీ చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని రైతులు, విద్యార్థులు ఆరోపించారు. నెల క్రితం అగ్రికల్చర్ ఆదాయ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికి ఇప్పటి వరకు జారీ చేయలేదని రైతులు తెలిపారు. కుల, ఆదాయం సర్టిఫికెట్‌ల కోసం గత నెల 20న మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోగా నేటి వరకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులు గురి చేస్తున్నారని యువకులు తెలిపారు.

సమస్యపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే

అంతర్గాం,మార్చి18(ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ముంపు గ్రామాలకు రావలసిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పదేళ్ళుగా పెండింగ్‌లో ఉందని మంగళవారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌ను మండల కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్‌లో కలిసారు. సానుకూలంగా స్పందించి త్వరలో అర్హులైన లబ్ధిదారుడికి ప్యాకేజీ అందేల కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మడ్డి తిరుపతి గౌడ్, పొట్యాల మాజీ సర్పంచ్ నీరజ వెంకటేష్, మండల బీసిసెల్ అధ్యక్షుడు బరుపటి శ్రీనివాస్, అట్టల్ రమేష్,చెల్లోజు స్వామి తెలిపారు.

ఖమ్మంపల్లి నుంచి మట్టి, ఇసుక అక్రమ రవాణా

ముత్తారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంపల్లి గ్రామంలో రాత్రి, పగలు తేడా లేకుండా కొందరు మట్టి, ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. అక్రమంగా రవాణా చేస్తూ లక్షల్లో సంపాదిస్తున్నారు. ఎక్స్‌కావేటర్ ద్వారా లారీలు, ట్రాక్టర్లలో మట్టిని, ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా రాత్రి వేళలో మట్టి దందా జోరుగా సాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు అధికారులకు ఫోన్ చేసి చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని, ఖమ్మంపల్లిలో మట్టి, ఇసుక మాఫియాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అఖిల భారత యాదవ సమావేశం

మంథనిరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): యాదవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అఖిల భారత యాదవ మహాసభ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఉగాది పండుగను పరస్కరించుకొని 2025 ఉగాది పురస్కారం కోసం సమావేశంలో చర్చించారు. ఈనెల 30న వివిధ విభాగాల్లో రాణించిన వారికి పురస్కారాలు అందజేస్తామని సభ్యులు తెలిపారు. 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. యాదవ సంఘం నేతలు మంద భాస్కర్, కన్నవేన శ్రీనివాస్, బత్తిని లక్ష్మణ్, పర్శ మోహన్, వేముల లక్ష్మణ్, ఓదెలు పాల్గొన్నారు.

రేపు కాలనీలో ఆయుర్వేద శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మాతా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో గురువారం కాలనీలో ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్జీ-2 అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే వైద్య శిబిరంలో ఆయుర్వేద వైద్యుడు విశ్వనాథ మహర్షి వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని అనిల్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎంను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఠాణాలో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

కోల్‌సిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కాంగ్రెస్ నాయకులు గోదావరిఖని సైబర్ క్రైమ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నల్గొండకు చెందిన బీఆర్ఎస్ నాయకులు నల్లరాము, అశోక్‌రెడ్డిలు ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉద్దేశ్యపూర్వకంగా అసభ్యపదజాలంతో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసినవారిలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కౌటం సతీష్, చుక్కల శ్రీనివాస్, ఉదయ్‌రాజ్, బండి రాము, ఎండీ గౌస్, బర్ల శ్రీనివాస్, ఎల్లేష్, వంశీ ఉన్నారు.

విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా బొగ్గు ఉత్పత్తి పెరగాలి



మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

గోదావరిఖని, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్ మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణితో ఇంధన ఒప్పందం ఉన్న అన్ని విద్యుత్ కేంద్రాలకు రోజుకు కనీసం 50రేకుల వరకు బొగ్గును రవాణా చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణతో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సూచించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని గనుల్లోనూ వేసవి జాగ్రత్త చర్యలను పాటించాలన్నారు. ఈ ఏడాది నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకున్న కిష్టారం ఓసీ, పీకే ఓసీ-4, జీడీకే ఓసీ-5, ఆర్జీ ఓసీ-2, ఆర్కే 6ఇంక్లైన్, ఆర్కే న్యూటెక్, ఎస్ఆర్పీ ఓసీ-2 గనుల అధికారులు, కార్మికులకు అభినందనలు తెలిపారు. ప్రతీ ఉద్యోగి భోజన విరామం మినహా మిగిలిన 8గంటల సమయాన్ని పూర్తిగా కంపెనీ అభివృద్ధికి, ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. డ్యూటీల విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నా, మస్టర్ పడి బయట తిరుగుతున్నట్లు తెలిసినా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌టీపీపీలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ ట్రయల్ రన్ విజయవంతం కావడంపై సీఎండీ హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డీ సత్యనారాయణ రావు(ఈఅండ్ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కే వెంకటేశ్వర్లు (పా, పీపీ), ఈడీ (కోల్ మూమెంట్) ఎస్‌డీఎం సుభానీ, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం(మార్కెటింగ్) ఎన్వీ రాజశేఖరరావు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.



తప్పుడు ప్రచారంతో సింగరేణికి నష్టం చేశారు



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో చేసిన ఎంఎండీఆర్ చట్టాన్ని కార్మిక సంఘాలు, పార్టీలు ప్రైవేటీకరణ అంటూ తప్పుడు ప్రచారం చేసి సింగరేణికి నష్టం చేశారని ఎస్‌సీఎంకేఎస్ (బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గనుల కేటాయింపు పారదర్శకంగా జరిపేలా చేసిన చట్టానికి బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని, సింగరేణిలో ప్రైవేటీకరణ అంటూ ఆందోళనలు చేశారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు వేలంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎంని కోరినట్టు ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనక పోవడంతో సింగరేణి 9 గనులను కోల్పోయిందని, 10 మిలియన్ టన్నుల బొగ్గు, 100 కోట్ల లాభం, 20 వేల వరకు ఉద్యోగాలు నష్టపోయినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన 35 వేల కోట్ల బకాయిలు ఇస్తే వేలం ద్వారా గనులు దక్కించుకునే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. సింగరేణిలో బదిలీలు, క్వార్టర్‌ల కేటాయింపులలో మంత్రులు, ఎమ్మెల్యేల జోక్యం మితిమీరిందని, డిప్యూటీ సీఎం అనుచరులకు చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులను కట్టబెట్టే కుట్రను అన్ని కార్మిక సంఘాలు అడ్డుకోవాలన్నారు. సారంగపాణి, రమేష్, మాదాసు రవీందర్, సతీష్, ప్రమోద్ కాసల్, అరుకుల ప్రసాద్, రౌతు రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ చేయాలి

రామగిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలో కాంట్రాక్టు కార్మికులకు మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ చేయాలని మంగళవారం జీఎం పిఏ విశ్వేశ్వర్‌రావుకు ఐఎన్‌టియుసి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆర్జీ-3 ఇంచార్జి ఉడుత శంకర్ వినతి పత్రం అందజేశారు. ఓసిపి-1లో కాంట్రాక్ట్ కార్మికులకు టైమింగ్ మార్పుతో పాటు టిఫిన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. సివిక్ కార్మికులకు ఆఫ్ డే కల్పించాలని, రెస్ట్ షెల్టర్ కల్పించాలని పేర్కొన్నారు. నాయకులు మల్లారి మల్లారెడ్డి, పాంచాల కృష్ణమూర్తిలు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీడీకే 7ఎల్ఈపీ గని ప్రభావిత గ్రామాల ప్రజల నుంచి వృత్తివిద్యా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య తెలిపారు. 7ఎల్ఈపీ గనికి సంబంధించి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మహిళలు, యువకులకు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గంవర్క్, యువకులకు లైట్ మోటార్ వెహికిల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వీర్లపల్లె, మారేడు పాక, విఠల్‌నగర్, రమేష్‌నగర్, అల్లూరు, పోతనకాలనీలకు చెందిన వారు సోమవారం వరకు జీఎం ఆఫీస్‌లో దరఖాస్తు చేయాలన్నారు.

లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



నృత్యాలు చేస్తున్న మహిళలు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1, 2, 3, ఏపీఏ ఏరియాల లేడీస్ క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌సీఓఏ క్లబ్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ల సతీమణులు మాలతీ సూర్యనారాయణ, విజయలక్ష్మి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. మహిళలందరిని ఒకే తాటిపై నిలిపి స్ఫూర్తి నిచ్చేందుకు అంతర్జాతీయ స్థాయిలో మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. లేడీస్ క్లబ్ సభ్యుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. నాలుగు ఏరియాల సేవా సమితి అధ్యక్షులు వనజావెంకటయ్య, అనిత లలిత్‌కుమార్, అలివేణి సుధాకర్‌రావ్, లలితాగుప్తా, వాణి శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.